

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

30 నవంబర్ 2025 పేజీలు : 08


# పెట్రేగిన.. గంజాయి మాఫియా !

- సీపీఎం కార్యకర్త దారుణ హత్య చేసిన మాఫియా
- పోలీసులపై ఎదురు దాడి
- గాలిలో కాల్పులు
- పోలీస్ అదుపులో ఒకరు

నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :

నగరంలో గంజాయి ముఠా సభ్యులు మరోసారి పెట్రేగి పోయారు. గంజాయి ముఠా కార్యక్రమాలు బలంగా ఉన్నాయనే దానికి ఈ యువకుని హత్యతో మరోసారి రుజువైంది. పోలీసులపై దాడులు చేసే స్థాయికి బరి తెగించిందంటే ఈ గంజాయి ముఠా కార్యకలాపాలు ఏస్థాయిలో ఉన్నాయో అవగతమవుతుంది. నెల్లూరు రూరల్, నగర శివారు ప్రాంతాలలో గంజాయి ముఠా కార్యకలాపాలపై పోలీసులు నిఘా ఉంచారు. స్థానిక ప్రజలలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఇటీవల అవగాహన పెంచారు. దానిలో భాగంగానే సీపీఎం కార్యకర్త పెంచలయ్య (34) సామజిక సేవలో భాగంగా స్థానిక ప్రజలలో ప్రచారం కల్పించే కార్యక్రమం చేపట్టారు. ఇదే ఆ మాఫియాకు కంతకింపుగా మారింది. ఈ ముఠాకు ఆరవ కామాక్షి అనే మహిళా నాయకత్వం వహించడం విశేషం. అయితే జరిగిన సంఘటనపై పోలీసులు అప్రమత్తం కావడంతో సమాచారం తెలుసుకొన్న పోలీసులు నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్నారని తెలియడంతో పోలీసులు రౌండ్‌వేయడంతో వారిపై గంజాయి బ్యాచ్ సభ్యులు తిరగబడటం.. పోలీసులు కాల్పులు జరపడం.. తర్వాత అరెస్ట్ చేశారు. గాయపడిన పోలీసులను వైద్య చికిత్సలు నిమిత్తం ఆసుపత్రిలో చేర్చారు. పెంచలయ్య

-మిగతా 2లో



పెంచలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

## నేరస్తుల గ్రూపులకు..
## మహిళా డాన్‌లు నాయకత్వం
### విస్తుపోతున్న నెల్లూరు నగరం

నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :

ప్రశాంతతకు మారుపేరు నెల్లూరు జిల్లా. ఇది ఒకప్పటి మాట.. గంజాయి ముఠాలు, గుట్కా బ్యాచ్‌లు, రౌడీ మూకల హత్యలు, దందాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ నేరాలు ముఠాలకు మహిళా డాన్లుగా పేరుగాంచడం, వాళ్ల నాయకత్వం వహించడం అందరిని విస్తు గొలుపుతుంది. ఇటీవల రౌడీలు వెనుక అరుణ అనే మహిళా డాన్‌గా పేరు వినపడడం.. అది మరువక ముందే ఆరవ కామాక్షి అనే మహిళా గంజాయి ముఠాకు నాయకత్వం వహించడం అందరినీ ఒకింత ఆశ్చర్యానికి గురింపచేస్తోంది. నేరస్తులకు మహిళలు నాయకత్వం వహించడం, నేరస్తులతో సంబంధాలను కలిగి ఉండటం నగరవాసులను ఆందోళన కలిగిస్తోంది. గతంలో నేరస్తుల చేతుల్లో మహిళలు అఘాయిత్యాలకు గురవడం వింటున్న సందర్భంలో.. ప్రస్తుతం నేరాల్లో మహిళలు కీలక భూమిక పోషించడం నెల్లూరులో విస్తరిస్తున్న నేర సామ్రాజ్యానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తోంది. నేరస్తుడుగా పోలీసులు చెబుతున్న జేమ్స్

-మిగతా 2లో



పోలీసుల అదుపులో ఉన్న గంజాయి బ్యాచ్ సభ్యుడు జేమ్స్

## ప్రభుత్వానికి మహిళల
# తడాఖా చూపిస్తాం

కాకాణి పూజిత




నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఈ ప్రభుత్వానికి మా మహిళల తడాఖా చూపిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత పేర్కొన్నారు. శనివారం జిల్లా వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జోనల్-4 అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరీ, తోటపల్లి గూడూరు జెడ్పిటిసి సభ్యులు

-మిగతా 2లో

# దిత్వా తుఫాను పట్ల.. ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### రానున్న 48 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు - నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోష్ అనూష

నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను ప్రభావంతో నెల్లూరు జిల్లాలో రానున్న 48 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు, గంటకు 60-80 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి నాగ సంతోష్ అనూష ఆదేశాలు జారీ చేశారు.

**సచివాలయాలే కేంద్రాలు :**

నెల్లూరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాలను తుఫాను సహాయక కేంద్రాలుగా (సైక్లోన్ హెల్ప్‌డెస్క్) మార్చారు. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా, లేదా



తుఫాను సమాచారం కోసం, వెంటనే మీ సమీప సచివాలయాన్ని సంప్రదించండి. అక్కడ సచివాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాల (రిలీఫ్ సెంటర్స్) వివరాలు సచివాలయంలో లభిస్తాయి.

**ఇళ్లకే పరిమితం అవ్వండి (స్టే ఇండోర్స్) :**

తుఫాను తీరం దాటే సమయంలో.. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు దయచేసి ఎవ్వరూ ఇళ్ల నుండి బయటకు రావద్దు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు సురక్షిత భవనాల్లోనే ఉండాలి. పాత భవనాలు, రేకుల షెడ్లు, లేదా మట్టి ఇళ్లలో ఉండేవారు వెంటనే ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.

**తీసుకోవలసిన ముఖ్యమైన జాగ్రత్తలు నీరు :**

వర్షపు నీరు తాగునీటి వనరులను కలుషితం చేసే ప్రమాదం ఉంది. కావున, తప్పనిసరిగా కాచి, వడపోసిన నీటిని (బాయిల్డ్ అండ్ ఫిల్టర్డ్ వాటర్) లేదా

-మిగతా 2లో

# క్లిక్.. ఆలయ సేవలు దర్శనం సేవలు సులభంగా




రాపూరు, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రాష్ట్రంలోని పలు ప్రముఖ దేవస్థానములలో సేవలు, దర్శనం, ప్రసాదం, వసతి బుకింగ్స్‌ను ఆన్లైన్ సేవల బుకింగ్ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిందని పెంచలకోన క్షేత్రం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ అండ్ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. భక్తులు తమ మొబైల్ ద్వారా ఇంటి నుంచే సులభంగా ఈ సేవలను బుక్ చేసుకుని, దేవస్థానంలో ఏర్పాటు చేయబడిన ఫాస్ట్-ట్రాక్ కౌంటర్లు, ప్రత్యేక క్యూ లైన్స్ ద్వారా త్వరితగతిన దర్శనం, సేవలు, వసతి, ప్రసాదం పొందవచ్చును. ఇందులో భాగముగా శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం, పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి దర్శనం, ఆర్జితసేవలు, వసతి, ప్రసాదం వాట్సాప్ ద్వారా, వెబ్ సైట్ ద్వారా ముందగా బుక్ చేసుకోను సౌకర్యం కలదని ఆయన ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్ బుకింగ్ కోసం వాట్సాప్ నంబర్: 95523 00009ను సంప్రదించాలని అదేవిధంగా అధికారిక వెబ్‌సైట్: https://www.aptemples.org/en-in/home లో తెలుసుకోవాలని ఈఓ అండ్ ఏసీ తెలియజేశారు. కావున భక్తులందరూ ఈ ఆన్లైన్ సేవలను విస్తృతంగా వినియోగించు కోవాలని దేవస్థానం ఈఓ అండ్ ఏసీ విజ్ఞప్తి చేశారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని సులభమైన, వేగవంతమైన, పరిపూర్ణ సేవలను పొందగలరని ఈఓ అండ్ ఏసీ సూచించారు. మీ సమయం విలువైనదని ఆన్లైన్ లో ఆలయ సేవలు బుక్ చేసుకోవాలని దేవస్థానం ఉప కమీషనరు, కార్యనిర్వ హణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు.

# దిత్వా తుఫాను పట్ల.. ప్రజలు అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలి. ఇది అతిసార, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారిస్తుంది.

**విద్యుత్ :**

ఈదురు గాలుల వల్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడే అవకాశం ఉంది. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు. మీ ఇంట్లోకి నీరు వస్తే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి.

**వాగులు/వంకలు :**

పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దు. సెల్ఫీలు/ఫోటోల కోసం ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లరాదు.

**మత్స్యకారులు :**

వేట కోసం సముద్రంలోకి వెళ్లడం పూర్తిగా నిషేధించబడింది. తీరప్రాంత ప్రజలు తమ పడవలను, వలలను భద్రపరుచుకోవాలి.

**ఆహారం :**

తుఫాను వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగవచ్చు. కావున, కనీసం రెండు రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, మందులు, బ్యాటరీ లైట్లు, కొవ్వొత్తులు సిద్ధం చేసుకోండి.

**అత్యవసర సహాయక నంబర్లు :**

ఏదైనా ఆపద సమయాల్లో ఈ కింది నంబర్లను సంప్రదించగలరు. ముందుగా మీ సచివాలయానికి లేదా స్థానిక ఆర్డీవో కార్యాలయానికి కాల్ చేయండి. నెల్లూరు ఆర్డీవో కంట్రోల్ రూమ్ 9849904061, జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 0861-2331261/79955 76699, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ 1070/112 సంప్రదించాలని తెలియజేశారు.

# ప్రభుత్వానికి మహిళల తడాఖా చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఎంజెటి శేషమ్మ, పొదలకూరు ఎంపిటిసి సభ్యులు లక్ష్మీ కళ్యాణి, దువ్వూరువారిపాళెం సర్పంచ్ కృష్ణవేణమ్మ, వైసిపి జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు లావణ్య, నెల్లూరు నగర మహిళా విభాగం అధ్యక్షురాలు ధనుజా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకాణి పూజిత మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కూటమి పార్టీలు ఎన్నో హామీలు ఇచ్చి, అమలు చేయకుండా, మహిళలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు అనేక వేధింపులకు దాడులకు గురవుతున్నారన్నారు. తమ ప్రాణాన్ని పణంగా పెట్టి, మరో ప్రాణానికి జీవం పోసే మహిళలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోవడం దౌర్భాగ్యం అన్నారు. సాక్షాత్తు రాష్ట్రానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్య రాణి వద్ద పనిచేస్తున్న అనధికార వ్యక్తిగత సలహాదారుడు సతీష్ కుమార్ ఒంటరి మహిళను వేధించడం బాధాకరం అన్నారు. కోవిడ్‌లో భర్తను కోల్పోయి, ఉద్యోగం కోసం వచ్చిన బాధిత మహిళను డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు, లైంగిక వేధింపులకు గురిచేయడం చూస్తుంటే, అధికార పార్టీకి చెందిన వ్యక్తుల దుర్మార్గాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. సహాయం కోరి వస్తే కూటమి ప్రభుత్వంలో రక్షకులే భక్షకులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇంటి పరువు కోసం పాకులాడుతూ కొందరు మహిళలు మౌనంగా రోధిస్తున్నా, కొందరు మహిళలు వేధిస్తున్నారని బహిరంగంగా మొరపెట్టుకుంటున్నా, కూటమి ప్రభుత్వం న్యాయం చేసే పరిస్థితిలో లేకపోవడం దారుణం అన్నారు. కూటమి పార్టీకి చెందిన వ్యక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ, మహిళలపై అత్యాచారాలు చేస్తుంటే, మొక్కుబడిగా కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం హాస్యాస్పదం అన్నారు. నిజాన్ని నిర్భయంగా బయటపెడుతూ, బాధిత మహిళకు అండగా నిలిచిన ఓ పత్రికపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ, అధికార పార్టీ నాయకుల చేత దాడులు చేయించడం చూస్తుంటే, రాష్ట్రంలో పత్రికలకు స్వేచ్ఛ ఉందా ! అనే అనుమానం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు నిజాలు తెలియకూడదనే ధోరణితో పని చేస్తుందన్నారు. జగనన్న పాలనలో మహిళలను గౌరవించి, పెద్దపీట వేశారన్నారు. మహిళల సాధికారత కోసం పనిచేసిన నాయకుడు మా జగనన్న అన్నారు. జగనన్న పాలనలో ప్రతి పథకాన్ని మహిళల పేరిట అందించి, మహిళలను అభివృద్ధి వైపు నడిపారన్నారు. జగనన్న మహిళలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారన్నారు. జగనన్న పాలనలో మహిళాభివృద్ధి, సంక్షేమం చూసిన మహిళలు, కూటమిపాలనలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలను చూసి ఆవేదన చెందుతున్నారన్నారు. మహిళల భద్రత కోసం దిశా యాప్ తీసుకొని వచ్చి, మహిళలకు ధైర్యాన్ని కల్పించిన వ్యక్తి జగనన్న అన్నారు. బాధిత మహిళ న్యాయం కోసం పోరాటం చేస్తున్నా, కూటమి పాలకులు తమకేమీ సంబంధం లేనట్లు ప్రవర్తించడం దారుణం అన్నారు. రాష్ట్రంలోని మహిళా శక్తి ఉద్యమిస్తే కూటమి ప్రభుత్వం తట్టుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో బాధిత మహిళలకు న్యాయం జరిగేంత వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. మహిళల పట్ల తప్పుగా ప్రవర్తించే వాళ్లు, ఎంతటివారైనా తప్పించుకోలేరన్న భయాన్ని కల్పించాలన్నారు. చంద్రబాబు తక్షణమే స్పందించి, పటిష్టమైన చర్యలు చేపట్టి, మహిళలను వేధిస్తున్న కీచకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.




# పెట్రేగిన.. గంజాయి మాఫియా !



గంజాయి ముఠా సభ్యుల చేతిలో గాయపడిన పోలీసు సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

మృతదేహాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పరిశీలించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ హత్య సంఘటనపై సీపీఎం నాయకులు స్పందించి గంజాయి బ్యాచ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# నేరస్తుల గ్రూపులకు..
# మహిళా డాన్‌లు నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా ఫేస్ బుక్ గ్రూపు పేరును జేమ్స్ 'కిల్లర్' అని పెట్టుకోవడం చూస్తే.. పోలీసులకు ఇదొక సవాల్ విసరడమేనన్న భావన కలుగుతుంది. కొత్త ఎస్పి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగర శివారు ప్రాంతాలపై దృష్టి సారిస్తుండటంతో ఒక్కొక్క విషయం వెలుగులోకి వస్తుంది. గతంలో పోలీస్ మెతక వైఖరి.. నేరస్తుల అలజడులకు ఒక కారణమని నగర వాసులు భావిస్తున్నారు. ఇప్పటికైనా నేరస్తుల పట్ల పోలీసులు కఠిన వైఖరి అవలంభించాలని ప్రజలు కోరుతున్నారు.

# వెనుకడుగు లేని అభివృద్ధి

## సర్వేపల్లిలో సోమిరెడ్డి డెవలప్‌మెంట్ డ్రైవ్



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదిలే కార్యక్రమంతో పాటు జోసఫ్‌పేటలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నేతృత్వం వహించారు. వన మహోత్సవంలో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గవ్యాప్తంగా 1.25 లక్షల మొక్కలు, వెంకటాచలం మండలంలో 27 వేల మొక్కలు నాటనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొక్కలను పశువుల నుంచి రక్షించేందుకు సీఎస్ఆర్ నిధులతో ట్రీ గార్డులు ఏర్పాటు చేసే ప్రయత్నం కొనసాగుతున్నట్లు చెప్పారు. రైతులకు ఊరటనిచ్చేలా కూటమి ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీ పథకాన్ని మళ్లీ ప్రారంభించిందని ఆయన తెలిపారు. గతంలో వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు జింక్, జిప్సం, బోరాన్ ఉచితంగా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో ఆ కార్యక్రమం నిలిచిపోయిందని విమర్శించి, ఇప్పుడు రైతులకు పిల్లిపెసర, జీలుగలు, జనుము విత్తనాలు 50శాతం సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. మత్స్యసంపద అభివృద్ధిలో భాగంగా రిజర్వాయర్‌లో మొదటి విడతగా 4.29 లక్షల చేపపిల్లలు, రెండో విడతలో మరో 6 లక్షలకు పైగా చేపపిల్లలు వదులుతున్నట్లు వివరించారు. రిజర్వాయర్‌పై ఆధారపడి 300 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, ఒక్కో కుటుంబం ఏటా రూ.1.52 లక్షల వరకు ఆదాయం సంపాదించే అవకాశం ఉందని తెలిపారు. మొత్తం రూ.4.50 కోట్ల విలువైన మత్స్యసంపద అందనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రావూరు రాధ కృష్ణమ నాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాగార్జున రెడ్డి, మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు మునుస్వామి, ఎంపీడీవో ఎంఆర్వోలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని మన్నారపు సిద్దయ్య ఎస్టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ సుభద్ర హెచ్చరించారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవత్వం సమ సమాజం స్థాపనకై రాజ్యాంగంలో పొందుపరిచిన వివిధ చట్టాలను ఉటంకిస్తూ రాజ్యాంగంలో పౌర హక్కులకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఎస్టీ కాలనీలో ఉన్నటువంటి ప్రాథమిక స్కూల్లో గడ్డి పెరిగిపోయి విషపు పురుగులు సంచరిస్తున్నాయని స్కూలు పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వచ్చినటువంటి అధికారులకు స్థానికులు వివరించారు. స్పందించిన ఎంపీడీవో మోహన్‌రెడ్డి స్పందించి ఉన్నటువంటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంఈఓ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రజలు పౌర హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కుల వివక్ష లేకుండా గ్రామంలో సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు.



కార్యక్రమంలో తహసిల్దార్ సుభద్ర, ఎంపీడీవో మోహన్ రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ జనార్ధన్, ఎంఈఓ బాల సుబ్రమణ్యం, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ సుబ్ర హ్మణ్యం, సైదాపురం సర్పంచ్ వెందోటి శారద, పంచాయతీ సెక్రెటరీ ఇంద్రాణి, వీఆర్వో హజరత్, సోషల్ వెల్ఫేర్ సోహమని, తదితరులు పాల్గొన్నారు.

# ధ్యాన సాధన ఓ అద్భుత వరం



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** నేటి జీవన విధానంలో మనుషులు అనేక ఆందోళనకు గురౌతున్నారు. దీనివలన అశాంతి అనారోగ్యం వారిని వెంటాడుతున్నాయి. అందువలన మనుషులు జీవితంలో ఆనందం పూర్తిగా మాయమైపోయింది. విపరీతమైన భయాందోళన మధ్య జీవనాన్ని కొనసాగించడం కారణంగా మనుషులు వారికున్న సగటు ఆయుష్షును కోల్పోవడం వలన అల్ప జీవులుగా మారి అల్లాడిపోతున్నారు. ఎలాంటి ఆందోళన లేకుండా జీవితాన్ని సాఫీగా నడిపించుకోవడానికి మనకు ధ్యానం ఎంతో ఉపయోగపడుతుంది. ధ్యానం ద్వారా మనిషి ఒత్తిడి లేని జీవితాన్ని సాధించవచ్చు అంతేకాదు మన చుట్టూ వున్న ప్రపంచాన్ని కూడా ప్రశాంతంగా మార్చవచ్చు. ధ్యానం ద్వారా వచ్చే ఫలితాలు. అభి అనుభవించే వారికి మాత్రమే పూర్తిగా తెలుస్తుంది ఒటాయి దీనికి తోడు.. పిరమిడ్ సాయంతో చేసే ధ్యానం మరింత అధిక ఫలితాలను ఇవ్వడం వలన ఆ ఫలితాలను స్వయంగా తెలుసుకుంటే తప్ప వివరిస్తే అర్థం కావని ధ్యానం గురించి తెలిసిన మాస్టర్లు వివరిస్తూ ఉంటారు.

### తోటపల్లి గూడూరు - భూమిలో పిరమిడ్

తోటపల్లి గూడూరు మండల కేంద్రమైన తోటపల్లి గూడూరులో ఒక అద్భుత నిర్మాణంగా చెప్పుకుంటున్న భూమిలోని పిరమిడ్ ఉంది. శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి వెనుక భాగంలో నిర్మించిన ఈ పిరమిడ్ గురించి మండలంలోని చాలామందికి తెలియదు. ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి నిర్మించిన ఇక్కడ ధ్యానశాలకు పిరమిడ్ ధ్యాన కేంద్రంలోని పలువురు మాస్టర్లు లోనూ సభ్యుల్లోనూ ఎంతో మంచి పేరు ఉంది. ఎలాంటి ఒత్తిడి లోనైనా ఈ ధ్యానశాలకు ఒకసారి వెళ్లి ఇక్కడ భూమిలో నిర్మించిన పిరమిడ్‌లో కూర్చుని ధ్యానం చేస్తే మనసు ఎంతో ప్రశాంతంగా మారిపోతుందని ఇక్కడికి వస్తున్న ధ్యాన సైనికులు చెబుతున్నారు. ధ్యానానికి కులం, మతంతో సంబంధం లేదు. ఇది మనుషుల్లోనే దాగి వున్న ఒక అతీతమైన అద్భుత శక్తి కనుక ప్రజలంతా ఇక్కడ ధ్యానశాలలో వున్న పిరమిడ్‌ను ఉపయోగించుకుని మంచి జీవితాన్ని జీవన విధానాన్ని పొందాలని ఇక్కడ గురువులు కోరుతున్నారు.

### ధ్యానంపై ముమ్మర ప్రచారం జరగాలి

తగినంత ప్రచారం లేనందున లక్షల రూపాయలు వేచించి నిర్మించిన తోటపల్లి గూడూరులోని పిరమిడ్ వెలవెల బోతుంది. దీనిపై ముమ్మర ప్రచారం చేయడంతో.. ఇలాంటి పిరమిడ్‌ను వేలుగులోకి తీసుకురావాలని, విద్యార్థులు, పిల్లలు, పెద్దలు అందరూ దీన్ని ఉపయోగించుకోవడం వలన చక్కటి జీవనశైలిని తద్వారా మంచి ఆరోగ్యాన్ని ఆయుష్షును పొందాలని నిర్వహకులు కోరుతున్నారు. అలాగే ధ్యాన కేంద్రాలను శ్రద్ధగా వినియోగించుకుంటే సంపూర్ణమైన ఆరోగ్యం సొంతమవుతుందని, ఒత్తిళ్లు ఒడిదుడుకులు లేని జీవితాన్ని పొందడం వలన ఆసుపత్రులు గొడవ తగ్గి ఆనందమయమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చు. అనే మాటను ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలని ఇక్కడ పిరమిడ్ నిర్వహణ బృందం విధిగా కోరుకుంటుంది.

# గూడూరును నెల్లూరులో కలపాలని గూడూరు ప్రజల ఆకాంక్ష

**తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో అభ్యంతర పత్రం సమర్పించిన బీజేపీ సీనియర్ నాయకులు దేవారెడ్డి గోపాల్ రెడ్డి**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని గూడూరు ప్రజల ఆకాంక్ష అని బీజేపీ సీనియర్ నేత దేవారెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు. జిల్లాల ఏర్పాటు ప్రిలిమినరీ గెజిట్‌పై అభ్యంతర పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూడూరు నెల్లూరు జిల్లాలో కలపాలని మా ప్రాంత ప్రజల చిర కాలపు కోరిక అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాడు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్థాయిలో హామీని విస్మరించడన్ని గూడూరు ప్రజల జీర్ణించుకో లేకుండా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు వాసులు నెల్లూరు జిల్లా సంస్కృతి సాంప్రదాయాలు బంధాలు బాంధవ్యాలతో ముడిపడి ఉన్నారు. నెల్లూరు భాషలో ఉన్న యాసతో గూడూరు ప్రజలు మమైకమై వున్నారు. జగన్ ప్రభుత్వం నెల్లూరు నుండి గూడూరు వేరుచేసి తప్పు చేసింది. అదే తప్పును చంద్రబాబు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అభ్యంతర పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మిడతల రమేష్, నరాల సుబ్బారెడ్డి, సృజన, పద్మ, టి.శ్రీనివాసులు, ఏవి సుబ్బయ్య. నారాయణ యాదవ్, బుధవరపు బాలాజీ. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో పీఏల ల్యాబ్‌ను ప్రారంభించిన జి.సుధీర్ బాబు



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలం ఆదురుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు 30 ట్యాబులను సమగ్ర శిక్ష నెల్లూరు వారు శనివారం అందించారు. ఈ ట్యాబులను 6 నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగు మరియు ఇంగ్లీషు,గణిత సబ్జెక్టులు సులభంగా నేర్చుకోవాడానికి మరింతగా శిక్షణ పొందేందుకు కోసం అని అకాడమిక్ మానిటరింగ్ అధికారి తెలియజేశారు. సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి సుధీర్ బాబు చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, డీసీఓ ప్రభావతమ్మ, చేజర్ల విద్యాశాఖ అధికారులు డీసీ మస్తానయ్య, జి.ఇందిరా, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : చెన్ను సోదరులు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాన్ ప్రభావంతో నేపథ్యంలో రాపూర్ మండలంలోని ప్రజలందరూ అన్ని వేళలా అప్రమత్తంగా వ్యవహరించాలని పెంచలకోన దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి తదితరులు శనివారం ఒక ప్రకటనలో సంయుక్తంగా కోరారు. శనివారం ఆదివారం దిత్వా తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలను ప్రజలు పరిగణలోకి తీసుకొని అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, ఎటువంటి అసౌకర్యాలు, ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత మండల అధికారులకు సమాచారం అందించాలని అదేవిధంగా స్థానిక కూటమి నాయకులు కూడా అవసరమైన సమాచారం అందించాలని చెన్ను సోదరులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో శని, ఆదివారాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అన్నివేళల అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాలను అందించాలని చెన్ను సోదరులు పిలుపు నిచ్చారు.

## కొత్తగా గృహ నిర్మాణాల పరిశీలన



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు, మండపం గ్రామంలో శనివారం గృహ నిర్మాణ శాఖ అధికారులు అర్హులైన వారికి గృహ నిర్మాణాలు మంజూరు చేసేందుకు పరిశీలన జరిపారు. వారి వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు మాట్లాడుతూ.. అర్హులైన వారికి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో హౌసింగ్ ఈఈ ఎంవి మోహన్‌రావు ఏఈ రాజారావు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజేశ్వరి గృహ నిర్మాణా లబ్ధి దారులు పాల్గొన్నారు.

## డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు ఉపాధ్యాయులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల టీచర్లు ఎంపిక అయినారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ నిర్వహించిన రెండు రోజులపాటు పోటీల్లో క్రికెట్‌తోపాటు త్రో బాల్ పోటీలు మండల స్థాయిలో జరిగి శనివారం ముగిశాయి. చివరి రోజు ముసునూరు వారి పాలెం జడ్పీ హైస్కూల్లో క్రికెట్ పోటీలు నిర్వహించగా ఉపాధ్యాయుల హాజరై పోటీల్లో పాల్గొని డివిజన్ స్థాయి పోటీలకు 16మంది కమిటీ ఎన్నిక కావడం జరిగింది. త్రోబాల్ పోటీలకు మహిళా టీచర్లు 12మంది ఎంపికయ్యారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ ఉన్నతాధికారి మధుసూదన్ మేజర్‌న్యూస్‌కు తెలియజేశారు.

## గొట్టిపాటి కుటుంబానికి మేకపాటి పరామర్శ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** గట్టుపల్లి చింతలపాలెం గ్రామానికి చెందిన గొట్టిపాటి ప్రసాద్ నాయుడు హత్యకు గురైన విషయం విధితమే. ఆ కుటుంబాన్ని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ప్రసాద్ నాయుడు సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడు, భార్య బిడ్డలతో ఆయన మాట్లాడారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం జగ్గయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణపరిరక్షణ సమిష్టిబాధ్యతగా భావించాలి

- పారిశుధ్యం మెరుగ్గా ఉంచుకోవాలి
- ఎన్ఎస్ఎస్ పీఓ పెంచలయ్య




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ సమాజంలోని అందరూ సమిష్టి బాధ్యతగా భావించాలని, పరిసరాల పారిశుధ్యం మెరుగ్గా ఉంచుకునేలా వ్యవహరించాలని ఆత్మకూరు ఎస్‌వి డిగ్రీకాలేజి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి.పెంచలయ్య పేర్కొన్నారు. కాలేజి కరస్పాండెంట్ నరశింహారెడ్డి, ప్రిన్సిపాల్ విజయ భాస్కర్‌రెడ్డిల పర్యవేక్షణలో పెంచలయ్య ఆధ్వర్యంలో ఆరురోజులుగా తెల్లపాడులో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాల శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆరవరోజైన శనివారం నీటిసంరక్షణ, వినియోగం, పారిశుధ్యం, పర్యావరణం తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమం, పారిశుధ్య మెరుగు, దోమల నివారణా చర్యలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈఅంశాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో వీధులను శుభ్రం చేయడంతోపాడు, సైడుకాలువలు, మురుగుకాలువలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలనివారణకు వారు బ్లీచింగ్ చల్లారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పెంచలయ్య ప్రసంగిస్తూ విద్యార్థి దశ నుండే వారిలో సామాజిక సేవా లక్షణాలను అలవాటు చేసేలా ఈవిధంగా వారంరోజుల పాటు సామాజికసేవా కార్యక్రమాలు శిభిరాన్ని నిర్వహిస్తున్నామని, దాంతోపాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం, పచ్చదనం, వ్యక్తిగత, పరిసరాల పారిశుధ్యం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అందరూ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేలా అందరూ తమవంతు బాధ్యతాయుతంగా విరివిగా మొక్కలు నాటి పెంచాలని,



తద్వారా గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియజేయాలని ఆయన కోరారు. మొక్కలను అధికంగా నాటి పెంచితే వాతావరణ సమతుల్యత ఉంటుందని, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పర్యావరణం మెరుగ్గా ఉంటుందని పెంచలయ్య పేర్కొన్నారు. ఈ అంశాలపట్ల అందరూ అవగాహన పెంపొందించుకోవాలని, చైతన్యవంతులై అన్నింటిని పాటించాలని, తమ గ్రామాన్ని పచ్చదనంగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజి సిబ్బంది ప్రసాద్, రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లయిన విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్ఎంకు వినతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరు నుండి ప్రతిరోజు రాత్రి 8.30గంటల సమయంలో ఉదయగిరి కివచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం బస్ సర్వీస్ నడపాలని శనివారం స్థానిక జన విజ్ఞాన వేదిక, ఎమ్మార్పీఎస్ నాయకులు దస్తగిరి అహ్మద్, బాల గురవయ్యలు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ షమీమ్‌కు వినతిపత్రం అందించి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయగిరి పరిసర ప్రాంతాల నుండి ప్రతిరోజు నెల్లూరు జిల్లా కేంద్రానికి పనులు, వ్యాపార, వైద్య అవసరాల నిమిత్తం వందల మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారన్నారు. సాయంత్రము నెల్లూరు నుండి ఉదయగిరికి రావాలంటే ఏడున్నర గంటలకు చివరి బస్సు ఉంది తర్వాత రావాలంటే చాలా కష్టనష్టాలకు ఓర్చుకుని రావలసిన పరిస్థితి నెలకొందన్నారు. నెల్లూరు నుండి ఉదయగిరికి రావడానికి చివరి బస్సు 8.30 గంటలకు బయలుదేరేలా బస్సు సర్వీసును ఏర్పాటు చేయాల్సి ఉందని కోరారు. అలాగే ఉదయగిరి నుండి చెన్నైకు సూపర్ లగ్జరీ బస్సులను, విశాఖపట్నంకు స్లీపర్ బస్సును ఏర్పాటు



చేయాలని కోరారు. రీజనల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి ఎస్సీ సెల్ నాయకులు గురవయ్య, కే.పెంచలయ్య, జి.రాజా, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడాపోటీలు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చిన్న చెరుకూరు, శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్న చెరుకూరు ప్రాంగణంలో శనివారం ఉపాధ్యాయుల కోసం మండల స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించి మండల స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాలు ఎంఈఓ-2 జయరామ నాయుడు మార్గదర్శకత్వంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.పద్మజ, ఫిజికల్ డైరెక్టర్లు కే.మల్లికార్జునరావు, విజయ్‌బాబు, శ్రీనివాసులు, సుమతి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగాయి. క్రీడల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల్లో కొత్త ఉత్సాహం, ఆనందం నింపిన ఈ పోటీల ద్వారా తోటపల్లి గూడూరు మండలం తరఫున క్రికెట్ జట్టును ఎంపిక చేసి డివిజన్ స్థాయి పోటీలకు పంపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఉపాధ్యాయులలో శారీరక దృఢత్వంతో పాటు టీమ్ స్పిరిట్ పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.

## వరి పంట సాగులో మెళ కువలు పాటించాలి

- రైతులకు శాస్త్రవేత్తలు సూచనలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** వరి పంట సాగులో రైతులు మెళకువలు పాటించాలని రైతాంగానికి శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ శాఖతోపాటు వెటర్నరీ, మత్స్య శాఖ అధికారులు నిర్వహించిన రైతన్న మీకోసం రైతు సేవలో ఒక మంచి ప్రభుత్వ కార్యక్రమం శనివారం ముగిసింది. మల్లూరు గ్రామ సచివాలయం జరిగిన శాస్త్రవేత్తలు డాక్టర్ వినీత, డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు ప్రభుత్వ ప్రయోజనాల గురించి తెలియజేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతుల పేర్లను ఆన్‌లైన్ చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సమాజంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉదయగిరి మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలసేవ పథక అధికారులు డాక్టర్ ఎన్.సునీత, పి.వెంకటేశ్వర్లు, పేర్కొన్నారు. ఆయన శనివారం కళాశాల బీఎస్సీ హాన్స్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని గండిపాలెం, వెంగళ రావు నగర్ గ్రామాల్లో సేవా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెట్లకు పెరిగిన కొమ్మలను నరికివేశారు. పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లోని అంతర్గత రహదారులను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.శోభారాణి, డాక్టర్ ఎన్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వయంగా ఆధార్ చేయిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయుడు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు కనీసం ఆధార్ కార్డులు కూడా చేయించుకోలేని వారి పట్ల శ్రద్ధ తీసుకొని స్వయంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడే తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి ఆధార్ చేయించడం ఆ ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలిచాడు. ఆయనే స్థానిక పాతూరులోని ఆనందలహరి పాఠశాల ఉపాధ్యాయుడు పి కొండారెడ్డి తన పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న సంచార జీవుల కుటుంబ పిల్లలకు ఇప్పటివరకు ఎలాంటి ఆధార కార్డులు లేకపోవడంతో ఆయన ప్రత్యేకించి పాఠశాలల్లో చేర్పించుకోవడంతో పాటు వారికి అవసరమైన ఆధార కార్డును ఎంఈఓ ను కలిసివిషయాన్ని తెలియజేసి ఆయన అనుమతితో వీరికి ఆధార్ కార్డులను చేయించారు. ఆయనలో ఉన్న విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించడం గమనించవచ్చు.

## పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని శకునాల పల్లె ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం కొన్ని హక్కులను ప్రసాదించిందని ఆ విధంగా వాక్ స్వాతంత్రపు హక్కు,జీవించే హక్కు మతస్వాతంత్రపు హక్కు, స్వేచ్ఛ హక్కు, పీడనాన్ని నిరోధించే హక్కు, తదితర హక్కులను కల్పించిందన్నారు. ఆ హక్కులకు భంగం వాటిల్లినప్పుడు న్యాయ స్థానాలకు వెళ్లి హక్కులను రక్షించుకోవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్బాస్ అలీ, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, ఏఎస్‌డబ్ల్యూఓ రమణారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టునకు దరఖాస్తులు ఆహ్వానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మేకపాటి రాజమోహనరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ పోస్ట్‌కు అతిథి అధ్యాపక నియామకానికై దరఖాస్తులు ఆహ్వానిస్తూనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.నారాయణ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌పీ బోటనీ పీజినందు 55శాతం మార్కులు సాధించి, నెట్, సెట్ లేదా పి.హెచ్‌డి, పూర్తి చేసి అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును, డిసెంబర్ 1వ తేదీన ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# గ్రామాభివృద్ధి మా లక్ష్యం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండల పరిధిలోని పలు పంచాయతీలలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశాల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని గ్రామాల అభివృద్ధి, పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా ముందుకు రావాలనే పిలుపు ఇచ్చారు. అభివృద్ధి పథంలో గ్రామాలు దూసుకెళ్లాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కలిగిరి మండలంలోని కావలి ముస్తాపురం, లక్ష్మీపురం పంచాయతీలలో టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు కోసం జరిగిన సమావేశాలకు కాకర్ల సురేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముందుగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి నిస్వార్థంగా పనిచేసిన బూత్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు, గ్రామ నాయకులు, అలాగే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న నాయకులను ఎమ్మెల్యే స్వయంగా అభినందించారు. వారి సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తదుపరి గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, గ్రామంలో మౌలిక వసతుల గురించి, సీసీ రోడ్ల అవసరం, తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి విషయాలను గ్రామ ప్రజలు వివరించారు. వాటిని శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ఈ సమస్యల పరిష్కారానికి అత్యంత వేగంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలు తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం టిడిపి మండల నాయకులు, గ్రామ నాయకుల సమక్షంలో ప్రతి పంచాయతీలో గ్రామ కమిటీలను సక్రమంగా ఎంపిక చేసి ఏర్పాటు చేశారు. పార్టీ బలోపేతం కోసం బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాల



అమలును గమనించేందుకు భాగంగా, ప్రతి రైతు కుటుంబంతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు గురించి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా, అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడతగా 7వేల రూపాయల ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమయ్యిందా? లేదా? అన్న విషయంపై ఎమ్మెల్యే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి రైతులను ప్రశ్నిస్తూ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అందరూ రైతులు ఏకగ్రీవంగా స్పందిస్తూ.. తమకు అన్నదాత సుఖీభవ మొత్తం సమయానికి అందిందని, అందిన నిధులు వ్యవసాయ పనుల్లో కొంతమేర ఆర్థిక భరోసాగా నిలిచాయని తెలిపారు. పంట సాగు కోసం అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఖర్చులకు ఈ సాయం ఎంతో ఉపయుక్తమైందని వారు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను శ్రద్ధగా విని, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులకు సూచిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతుకు అండగా నిలబడటం తనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతేనని తెలిపారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న ఈ కార్యక్రమం ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం-ప్రజలు కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంత తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

### రాపూర్ మండలాన్ని తిరుపతిలో కలిపితే..

# కండలేరు డ్యాం జల వివాదాలతో నిండిపోతుంది



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కండలేరు డ్యామును రెండుగా చేయొద్దని తిరుపతిలో తెలుగు గంగ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సునీల్ నాయక్‌కు బీజేపీ రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ పత్రం సమర్పించారు. రాపూర్

**బీజేపీ నేత మిడతల రమేష్ హెచ్చరిక**

మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపితే కండలేరు డ్యాం రెండుగా విభజింపబడుతుంది. వందల సంవత్సరాల నాటి కండలేరు సహజ వాగుపై ఆధారపడి ఉన్న రైతాంగం నీటి హక్కులు హరింపబడతాయి. కండలేరు నీటిమట్టం కంటే ఎత్తుగా ఉన్న పొదలకూరు మండలంలోని 14 గ్రామాలకు నీటి లభ్యత మీద ప్రతికూల పరిస్థితి ఏర్పడతాయి. ముంపు నిరుద్యోగుల అర్హత సీనియారిటీ జాబితా కూడా రెండుగా విభజింప పడుతుంది. రాపూరు కలువాయి మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని బీజేపీ డిమాండ్ చేస్తుంది. మా డిమాండ్‌ను చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రికి తెలపాలని రమేష్ తన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, దేవారెడ్డి గోపాల్ రెడ్డి, తరుణ్ కృష్ణ, శరవణ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మనుమసిద్ధి నగర్ ప్రాంతంలో శనివారం పర్యటించారు. స్థానికంగా నిర్మిస్తున్న డ్రైను కాలువ పనులను, మొక్కల పెంపకాన్ని కమిషనర్ పరిశీలించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. డ్రైను కాలువలలో పూడికతీత సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా నిర్వహించి వర్షాకాలంలో వరద నీరు సాఫీగా ప్రవహించేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటు స్కూలు బస్సులు తనిఖీ





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని ప్రవేట్ పాఠశాలల బస్సులను రవాణా శాఖ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇటీవల జరుగుతున్న బస్సు ప్రమాదాలపై అప్రమత్తమైన రవాణా శాఖ అధికారులు పాఠశాలల బస్సులను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వెహికల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో బస్సులు ప్రమాదానికి గురై అనేక ప్రాణాలు పోతున్న నేపథ్యంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సేఫ్టీ పరికరాలు, సీట్లు పరిమితి, ఎమర్జెన్సీ డోర్స్ ఎంతవరకు ఉన్నాయి, అనే విషయాలపై శనివారం పట్టణంలో అన్ని ప్రైవేటు స్కూలు బస్సులను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారుడు రవాణా శాఖ నిబంధనలను పాటించి ప్రమాద రహిత ప్రయాణాను కొనసాగించాలన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయులలో ఆరోగ్యం శారీరక దృఢత్వం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ పి.రమేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఉపాధ్యాయు లకు క్రికెట్ మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు విజేతలైన వారు డిసెంబర్ 13, 14 తేదీలలో డివిజన్ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొంటారన్నారు. అలాగే డివిజన్ స్థాయిలో గెలుపొందిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మధుసూదన్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండయ్య కోఆర్డినేటర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి వివిధ పాఠశాలల పీడీలు ఆర్ అంజయ్య వీ.కృష్ణయ్య, ఎం.తిరుపాల్‌రెడ్డి రజనీ విలాషిని సుమలత జి.ప్రసన్నలక్ష్మి సునీల్ కుమార్ సిహెచ్ వెంకటేశ్వర్లు, పాఠశాల సహాయకులు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది మౌనిక శ్రీహరి ఎస్కే జలీల్ జి.హజరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ భారీ వర్షాల నేపథ్యంలో నగరంలోని వివిధ డ్రైన్ కాలువల నిర్వహణ తీరును శనివారం తనిఖీ చేశారు. స్థానిక సీఆర్పీ డొంక సర్వేపల్లి కాలువ మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్ఎస్ఆర్ పాఠశాల వద్ద డ్రైన్ కాలువ, ఉయ్యాల కాలువ, మల్లాపు కాలువలను పరిశీలించి మురుగునీటి ప్రవాహం సాఫీగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించండి : జడ్పీ చైర్ పర్సన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదానికి గురై నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనాధికారి టి.రాజశేఖర్‌ని జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ శనివారం పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందిచాలని వైద్యులకు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పర్సన్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు అంతస్తు తొలగింపు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు స్థానిక 26వ వార్డు వేదాయపాలెంలో పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులను భవన యజమాని అతిక్రమించి నిర్మిస్తున్న భవనంలోని అదనపు అంతస్తు నిర్మాణం కొరకు ఏర్పాటు చేస్తున్న కాలమ్స్‌ను సిబ్బంది శనివారం తొలగించారు.

# సీవీకే జీజేసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ సేవలు ప్రశంసనీయం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మేజర్ పంచాయతీ పరిధిలోని మల్లమ్మగుంట ప్రాంతంలోని గిరిజన కాలనీలో రాపూరు సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను చేయడం ప్రశంసనీయమని రాపూరు సీడీపీఓ సునంద వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం ఆమె మల్లమ్మ గుంటలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంప్‌ను సందర్శించి విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించి అనంతరం నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 25వ తేదీన సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలప్రిన్సిపాల్ కృష్ణవేణి స్పెషల్ ఎన్ఎస్ఎస్ యూనిట్ క్యాంప్ ప్రాంతంలో ప్రారంభించారు. ఈ క్యాంప్ డిసెంబరు వడతది వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మల్లమ్మగుంట ఎస్టీ కాలనీ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, పర్యావరణం పరిశుభ్రత, మొక్కలు నాటడం, సీజనల్ వ్యాధులపై అవగాహన, రోడ్లు, పాఠశాల, దేవాలయాలు శుభ్రపరచడం తదితర కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు విద్యార్థిని విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జీ.సాయికిరణ్, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమా, కళాశాల లెక్చరర్స్ సరిత, సుధాకర్, మీనాకుమారి, ప్రవీణ్ కుమార్, కాలేషా, కృష్ణ, కవిత, రామ లింగయ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరి డిపోను తనిఖీ చేసిన ఆర్టీసీ ఆర్ఎం షమీమ్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకంలో ఆర్టీసీకి రాబడి పెరిగిందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ షేక్ షమీమ్ పేర్కొన్నారు. శనివారం ఉదయగిరి ఆర్టీసీ డిపోను సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో డిపో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ.. నెల్లూరు రీజియన్ పరిదిలో అక్యుపెన్సీ రేషియో గతంలో 65శాతం ఉండగా ప్రస్తుతం 83 శాతానికి పెరిగిందన్నారు. కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న బస్సు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్సికి వచ్చే బస్సులకు నూతన వైరింగ్ చేపడుతున్నామన్నారు. మార్గమధ్యంలో బస్సులు నిలిచిపోకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిస్తున్నామన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోలో గతేడాది కేఎంపీఎల్ 5.92 ఉండగా ప్రస్తుతం 5.90 ఉందన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్కుమార్, ఏఎంటీ నాగభూషణం, ఏఎంఎస్ నాగరత్నం, జనరల్ ఏడీసీ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తాం

## సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఆదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని సమగ్ర శిక్ష ఆడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పీ.వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. మనబడి-మన భవిష్యత్తు-2 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 1,356 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయన్నారు. వాటిలో 657 భవనాలు పూర్తి కాగా 699 భవనాల నిర్మాణం 80శాతం పూర్తయిందన్నారు. పేరెంట్స్ మేనేజ్మెంట్ కమిటీ ఖాతాల్లో రూ.6.50కోట్లు నిధులు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఆ నిధులతో మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేసి అదనపు తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జిల్లాలో పీఎంశ్రీ



పథకం కింద 46 పాఠశాలలు ఎంపిక కాగా 39 పాఠశాలల్లో నూరు శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పాఠశాలల్లో పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు, ఉపాధాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరవేడుజంగాలపల్లిలో విద్యుత్‌మోటర్ల వరుస చోరీలు



## ఆందోళన చెందుతున్న రైతులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం ఆరవేడుజంగాలపల్లిలో రైతులు పొలాల్లో అమర్చుకున్న విద్యుత్‌మోటర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయని వారంతా ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయపొలాల్లో సాగునీటిని పారించుకునేలా ఈ మోటర్లను ఏర్పాటు చేసుకున్నారు. వారం రోజుల్లోపే ఐదారుమంది రైతులకు చెందిన విద్యుత్‌మోటర్లు దొంగిలించబడ్డాయి. ఈమేరకు పోలీసులకు కూడా వారు ఫిర్యాదు చేశారు. పైర్లు సాగుచేసుకునే అదునులో వేలాదిరూపాయల విలువగల మోటర్లు చోరీకి గురికావడంతో మళ్ళీ మోటర్లను బిగించుకోవడం వ్యయభారం అవుతుందని వారు ఆవేదనతో చెబుతున్నారు. వెంటనే ఏర్పాటు చేయకుంటే పైర్ల సాగు ఇబ్బందికరంగా మారుతుందని వారు చెబుతున్నారు. దుండగులు విద్యుత్‌సరఫరాను ఆపివేసి మోటర్లను దొంగిలించుకుపోతున్నారని వారు పేర్కొన్నారు. రబీసీజన్ ఆరంభంబై పైర్లు సాగుచేసుకునే సమయంలో ఈ విధంగా మోటర్ల వరుసచోరీలు ఆందోళనకరంగా ఉన్నాయని వారు వాపోతున్నారు. పోలీసులు వెంటనే స్పందించి గట్టి నిఘా ఉంచాలని, ఈచోరీల గురించి నిశితంగా విచారించాలని, నిందితులను గుర్తించి మోటర్ల ఆచూకి వెలికితీయాలని, మళ్ళీ ఈ విధంగా చోరీలు జరుగకుండేలా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఆటవస్తువులను సద్వినియోగం చేయాలి : సీడీపీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటవస్తువుల కిట్‌లను శనివారం ఆత్మకూరు ఐసిడిఎస్ సీడీపీఓ పి.సునీలత పంపిణీ చేశారు. స్తానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ కిట్లను అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో పూర్వప్రాథమిక విద్య అందిస్తుండే విషయం విధితమే. ఇందుకుగాను ప్రభుత్వం చిన్నారులను ఆడించేలా ఆటవస్తువులను ప్రభుత్వం సరఫరా చేయగా వాటిని సునీలత అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు. ఈ ఆటవస్తువులను సద్వినియోగం చేయాలని, వాటిద్వారా చిన్నారులకు ఆటపాటల పూర్వప్రాథమిక విద్యను సక్రమంగా అందించాలని సీడీపీఓ సూచించారు. ఆటవస్తువులను లక్ష్యం మేరకు సద్వినియోగం చేయాలని సునీలత కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 13న సాధారణ సర్వసభ్య సమావేశం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు డిసెంబర్ 13వ తేదీ ఉదయం 10:30 గంటలకు జరుగుతుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా ప్రజా పరిషత్ సభ్యులందరినీ హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే జిల్లా స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన అన్నారు.

## డిసెంబర్ 1న జాబ్ మేళా




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నెల్లూరు నగరం హరనాథపురం లోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో డిసెంబర్ 1వ తేది ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలారాణి తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. నెల్లూరు కార్పొరేషన్, కావలి, ఆత్మకూరు, కందుకూరు, బుచ్చిరెడ్డిపాలెం మునిసిపాలిటీల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం మెప్మా 'నిపుణ' సంస్థతో కలిసి సుమారు 50కంపెనీలను జాబ్ మేళాకు ఆహ్వానించారు. వయస్సు 18-31 సంవత్సరాలు, విద్యార్హతలు 10వ తరగతి నుండి పీజీ వరకు ఉన్న అభ్యర్థులు సంబంధిత సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలారాణి తెలిపారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు అక్కడికక్కడే నియామకపత్రాలు అందజేయబడతాయని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు https://jobmela.mepmaap.com నందు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు క్రికెట్ పోటీల్లో భాగంగా బ్యాటింగ్, బౌలింగ్ చేసి ప్రారంభించారు. ఉపాధ్యాయినీలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు డివిజన్, అక్కడ నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆటల పోటీలను సమగ్ర శిక్ష ఏపీసీ పీ.వెంకట సుబ్బయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు 11 గుంటుపల్లి శ్రీనివాసులు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ మోపూర్ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నుండి గ్రామస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూర్ గ్రామం నందు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ఉద్యమం సంతకాల సేకరణ కార్యక్రమం నెల్లూరు రూరల్ మండలం నాయకులు, కార్యకర్తలతో కలిసి సేకరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఆనం విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రవ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 8వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యేటువంటి పరిస్థితుల్లో 3వేల కోట్ల రూపాయలతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను శంకుస్థాపన చేయడం జరిగింది. అందులో 5మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో ప్రారంభించడం జరిగింది. ఒక మెడికల్ కళాశాల అధ్యాపకుల నియమించకపోవడం వలన ప్రారంభం కాలేదు. మిగిలిన 11 మెడికల్ కళాశాలలో వివిధ దశల్లో నిర్మాణం జరుగుతూ ఉన్నాయి. ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం ఈ 17 మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సౌత్ మోపూర్ గ్రామ బండ్ల రాజేంద్రప్రసాద్, జాన మస్తానయ్య, కరీం భాష, సురేష్, మురళి, నాగరాజు, నాని, కిరణ్ కుమార్ రెడ్డి, సతీష్, వెంకటేష్, రామ్ కుమార్ రెడ్డి, గౌతమ్, చెవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎం శివయ్య, షేక్ మస్తాన్, రోకటి సీనయ్య, రంగారావు, విష్ణు, రవి కుమార్, గంపల సుధాకర్, దాచుర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీహెచ్‌పీలచే ఐరన్ ర్యాక్‌లు వితరణ అభినందనీయం

## 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో శనివారం, ఎన్‌బీటీ కాలనీ, అర్బన్ హెల్త్ సెంటర్‌కు రాష్ట్ర పీహెచ్‌పీ కోశాధికారి, జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ తండ్రి స్వర్గీయ శాఖవరపు వెంకటరమణయ్య 11వ వర్ధంతి సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్‌కు మూడు ఐరన్ ర్యాక్‌లు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకున్న వాళ్ళు ఉన్నత స్థాయికి ఎదుగుతారని, మనం మన తల్లిదండ్రులను గౌరవిస్తే మన పిల్లలు కూడా మనల్ని గౌరవిస్తారన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా ఇంట్లోనే ఉంచుకొని గౌరవించి, ఆదరించి, సమాజానికి ప్రేరణ ఇచ్చేందుకు నేటి కాలం ముందుకు రావాలని ఆయన కోరారు. వివిధ కారణాలవల్ల వృద్ధులను ఇంటికి దూరంగా పెట్టడం అనేది అనాగరికత అని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిరోజు పాల్గొంటున్న శాఖవరపు వేణుగోపాల్‌కు వారి కుటుంబ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుత్తూరు రీనా భారతి మాట్లాడుతూ.. విద్యాలయాలకు, వైద్యశాలలకు సహకరించ వలసిన బాధ్యత అందరిపై ఉందని ఆమె అన్నారు. శుభకార్యాలు, స్వర్గస్తులైన పెద్దల గుర్తు సందర్భంగా ప్రతి ఒక్కరూ పాఠశాలలకు, ఆసుపత్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆమే విజ్ఞప్తి చేశారు. మానవతా దృష్టితో నిరుపేదలను ఆదరించవలసిందిగా ఆమే కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌పీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, యోగా మాస్టర్ పెంచలయ్య, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, విశ్రాంత ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, హాస్పిటల్స్ సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

# రైతన్న-మీకోసంలో పాల్గొన్న చెన్ను

**రాపూరు, మేజర్‌న్యూస్ :** అన్నదాతల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అశోక్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన రాపూరు మండలంలోని వీరాయపాలెం గ్రామంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల బాగోగులు పట్టించు కోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చెన్ను అశోక్‌రెడ్డి ఆరోపించారు. రైతులకు అవసరమైన అనేక వ్యవసాయ యాంత్రికరణ పరికరాలను ఇవ్వకుండా ఇబ్బందులకు గత ప్రభుత్వం గురిచేసిందని ఆయన విమర్శించారు. అన్నదాతలను ఆర్థికంగా ఆదుకు నేందుకు పిఎం కిసాన్ – అన్నదాత– సుఖీభవ పథకం ద్వారా రూ. 20వేలు అందించినఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దక్కుతుందని చెన్ను అశోక్‌రెడ్డి స్పష్టం. ఈ కార్యక్రమం బొజ్జనపల్లి సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి, ఆవుల రమేష్, గంపల పుల్లయ్య, తాటిబోయిన చంద్రయ్య, వినయ్, చిన్నసుబ్బయ్య తదితరుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాపూరు పీఏసీయస్ అధ్యక్షులు దండోలు వెంకటేశ్వర్లురెడ్డి, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చిగల రత్నయ్య, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధు సూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు మధు నాయుడు, మండల కార్యదర్శి కూనిపోగు కన్నయ్య, మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ పఠాన్ బాషా, గిలకపాడు టీడీపీ నాయకులు జనార్దన్ రెడ్డి, తూమాయి సర్పంచ్ చంద్రమోహన్, టీడీపీ నాయకులు శంకర్, నారాయణ సమయం ప్రసాద్, రాజా, జనసేన నాయకులు బుజ్జమ్మ, బెల్లం అంకయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం కార్యకర్త పెంచలయ్య హత్యను ఖండిస్తున్నాం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నిన్నటి రోజున పడారుపల్లి దగ్గర ఉన్న ఆర్డిటి కాలనీలో జరిగిన ప్రజానాట్యమండలి కళాకారుడు సీపీఎం కార్యకర్త పెంచలయ్యను గంజాయి బ్యాచ్ అతి కిరాతకంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుది విజయకుమార్ తల్లు సీనయ్య ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పిలీలా మోహన్ నందిపోగురు రమణయ్యలు నేడు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్డిటి కాలనీలో గత కొంతకాలంగా గంజాయి బ్యాచ్ చెలరేగిపోదనడంతో సీపీఎం కార్యకర్త పెంచలయ్య నాయకత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఆ గ్రామ అభివృద్ధి కోసం ఇక్కడ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదని, గంజాయి మత్తు పదార్థాలు లాంటివి అమ్మకూడదని గట్టిగా ఊర్లో ఉన్న ప్రజలందరిని ఏకం చేయడం తట్టుకోలేని కొంతమంది అసాంఘిక కార్యక్రమాలు నడుపుతున్నటువంటి వ్యక్తులు నిన్నటి రోజున వారి కొడుకుని స్కూల్ నుంచి తీసుకు వస్తున్న సమయంలో కాపు కాసి అతి కిరాతకంగా చంపడాన్ని చూస్తుంటే సమాజం ఎటు పోతుందో అర్థం కావడం లేదని, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడం ద్వారా ప్రాణాలు కోల్పోయిన పెంచలయ్య ఆత్మకు శాంతి జరగాలంటే ఆయనను చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని, అప్పుడే ఆ కుటుంబానికి నిజమైన న్యాయం జరిగినట్లు అవుతుందని అన్నారు. పెంచలయ్య హత్య చేసిన వారు ఎంతటి వారైనా వారిని కఠినంగా శిక్షించాలని ఇటువంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా నెల్లూరు నగరంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా గంజాయి సప్లై చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించి నెల్లూరు జిల్లాను ప్రశాంతంగా చూడాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందని వారు విజ్ఞప్తి చేశారు.

# ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ



**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** సీతారామపురంలోని ఆదర్శ పాఠశాలను జిల్లా ఏపీసీ వెంకటసుబ్బయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల వసతి గృహంలోని విద్యార్థులను అక్కడ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెనూ ప్రకారం భోజనం, బాత్రూంల పరిశుభ్రత, విద్యార్థులపై సిబ్బంది పనితీరు అడిగి ఆరా తీశారు. బాలికల వసతి గృహంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో వార్డెన్లు ప్రతిరోజు ఉదయం సాయంకాలం స్టడీ అవర్స్ నిర్వహించాలని తెలిపారు. వసతి గృహంలోని విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలాగా పనిచేయాలని తెలిపారు.

# యువకళాకారుని హత్య అత్యంత దారుణం : సీపీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో గంజాయిముఠా వివిద కళారూపాలతో ప్రజలను చైతన్యపరుస్తున్న యువకళాకారుడు, సీపీఎం కార్యకర్త కె. పెంచలయ్య(37)మీద విరుచుకుపడి కత్తులతో వెంటాడి హత్యగావించడం అత్యంత దారుణమని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి యామాల మధు పేర్కొన్నారు. పెంచలయ్య తనపల్లిలతో కలిసి రోడ్డుపై వస్తుండగా ఆయనపై ఈ అమానుష దాడి జరిగిందన్నారు. ఓ పథకం ప్రకారం గంజాయిముఠా పెంచలయ్యను హతమార్చారని ఆయన పేర్కొంటూ సంఘటనను తీవ్రంగా ఖండించారు. పెంచలయ్య నెల్లూరు రూరల్ ప్రజానాట్యమండలి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయనను హత్యచేసిన నిందితులను పోలీసులు వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల నెల్లూరులో విచ్చలవిడిగా పెరిగిన గంజాయి సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడానికి పెంచలయ్య అనేక కళారూపాలను ప్రదర్శించారని మధు తెలిపారు. పోలీసుల సహకారంతో కూడా కొన్ని కార్యక్రమాలు నిర్వహించాడన్నారు. గంజాయి మానాలంటూ ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశాడని, ఇది నచ్చని గంజాయి ముఠా పకడ్బందీగా పథకం రూపొందించి ఆయనను హతమార్చారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వెంటనే నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు.

# పోలీస్‌క్వార్టర్ల ఆవరణను శుభ్రం చేయాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ప్రధానమైన పోలీస్ క్వార్టర్స్ ఆవరణ కంప చెట్లతో నిండి అత్యంత భయంకరంగా మారిం ది. వివిద ప్రజాసమస్యల పట్ల స్పందించే ప్రజాసమాఖ్య నాయకుడు, ఏపిరైతుసంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ శనివారం ఆవరణను పరిశీలించి అత్యంత విచారం వ్యక్తం చేశారు. పెద్దఎత్తున కంపచెట్లు పెరిగి కాలుపెట్టలేని పరిస్థితి, విషసర్పాల సంచారం అధికంగా ఉందని, ఆచెట్లను తొలగించి ఆవరణను శుభ్రం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. తాము బాల్యదశలో ఉన్నపుడే ఈ ఆవరణలో ఒక త్రాగునీటి బావి ఉండేదని, ఈప్రాంతవాసులంతా ఆ నీటినే తెచ్చుకొని త్రాగేందుకు వాడుకుంటూ పోలీస్‌బావిగా ఉండేదన్నారు. ఆ బావి ఈ కంపచెట్ల మధ్య ఎక్కడుందో కానరాని పరిస్థితిగా ఉందన్నారు. ఈకంపచెట్ల వలన పోలీస్ క్వార్టర్లకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రసాద్ కోరారు.

# విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధికి క్షేత్రపరిశీలన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం రేవూరు జెడ్పి హైస్కూల్ విద్యా ర్థులు నైపుణ్యాల అభివృద్ధిలో భాగంగా శనివారం ఆత్మకూరులో క్షేప్రరిశీలన గావిం చారు. హైస్కూల్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు సూచనలతో ఫిజికల్‌సైన్స్ ఉపాధ్యాయుడు రత్నారెడ్డి, ఒకేషనల్ ఉపాధ్యా యుడు రవిశంకర్, భాస్కర్‌లు 9,10 తరగతుల విద్యార్థులను ఆత్మకూరుకు తరలించి సూపర్ మార్కెట్లు, షాపింగ్‌మాల్స్‌లో వ్యాపారాలతీరు. వస్వుతుల తయారీగురించి పరిశీలించి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వ్యాపారాలను నిర్వహించే విధానాలు, ఆ వస్తువులను తెచ్చుకోవడం, వాటిని ఎక్కడ ఎలా తయారు చేస్తారనే అంశాల గురించి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, దుకాణాల నిర్వాహకులు వివరించారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్ళరాదు
- ప్రజల సహాయార్థం: కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టరేట్ కంట్రోలు రూం నెంబర్లు : 0861- 2331261, 7995576699
- జేసీ మొగిలి వెంకటేశ్వర్లు



**నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో.. జిల్లాలో ఈ నెల 30, డిసెంబర్ 1వ తేది వరకు రెండు రోజుల పాటు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జేసి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాలు, తీరా ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ముందస్తుగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్ళరాదని ఆయన సూచించారు. నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు, ఆర్ అండ్ బి, పీఆర్, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీ రాజ్, మున్సిపల్, శాఖలతోపాటు అన్ని లైన్ డిపార్ట్మెంట్లు 24×7 అప్రమత్తంగా ఉంటూ.. తగు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

### కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు : జేసీ

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను ఏర్పాటుచేసినట్లు జేసి మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షాల వలన ఇబ్బందులు తలెత్తితే కంట్రోలు రూం నెంబర్లు : 0861- 2331261, 7995576699 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కంట్రోలు రూంలో 24 గంటలు విధులు నిర్వహించేలా సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అలాగే అందరూ ఆర్డీవోలు తమ తమ కార్యాలయాల్లో కంట్రోలు రూములను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు.

# వేగవంతంగా చర్యలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ వివిధ అంశాలపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ వైఓ నందన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. సమావేశంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, రెవిన్యూ వసూళ్లు, ఆటోమ్యూటేషన్, యానిమల్ భర్త్ కంట్రోల్, అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాల అములు, టిడ్కో ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాల అమలు ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కమిషనర్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీడీఎంఏ నిర్దేశించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రఘునాథరావు, డీపీఆర్ఓ వాసు బాబు, రెవిన్యూ సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది, టిడ్కో, ప్లానింగ్ సిబ్బంది హాజరయ్యారు.

# దిత్వా తుఫాను నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

## నెల్లూరు రూరల్ మండల తహసిల్దార్ కృష్ణ ప్రసాద్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల పరిధిలో దిత్వా సైక్లోన్ నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశమున్నందున ప్రజలకు తక్షణ సహాయ చర్యలు అందించేందుకు, అత్యవసర పరిస్థితులను వెంటనే సంబంధిత శాఖలకు చేరవేసేందుకు 24×7 కంట్రోల్ రూమ్‌ను నెల్లూరు రూరల్ మండలం తహసిల్దార్ కృష్ణ ప్రసాద్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూం నెం:9441592127 సంప్రదించాలని తెలియజేశారు. అలాగే గ్రామ సచివాలయ కేంద్రాలను సైక్లోన్ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అక్కడ సచివాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. అదే విధంగా భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు దయచేసి ఎవ్వరు ఇంటి నుండి బయటకు రావద్దని తెలియజేశారు. ముఖ్యంగా పిల్లలు వృద్దులు, గర్భిణీ స్త్రీలు సురక్షిత భవనాల్లోనే ఉండాలని తెలిపారు.

# మున్సిపల్ కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు : కమీషనర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాన్ నేపద్యంలో ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని కమీషనర్ సి.గంగాప్రసాద్ పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికల నేపద్యంలో ఆత్మకూరు పట్టణ, మున్సిపల్ పరిధిలోని అందరు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏదేని సహాయకచర్యలు అవసరమైతే వెంటనే 08627220385 నెంబరుకు ఫోన్‌చేయాలని ఆయన సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షాలు వచ్చే అవకాశాలున్నాయని, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి కలిగినా వెంటనే ఈనెంబరుతో కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేయాలని ఆయన కోరారు. మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినా సహాయకచర్యలకు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

## శ్రీవారి నిత్యాన్నదానంకు రూ.1,10,116 విరాళం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రం శ్రీలక్ష్మి నృసింహస్వామివారి నిత్యాన్న దాన పథకంకు హైదరాబాద్ వాస్తవ్యులు తిక్కవరపు వినాయక రవిరెడ్డి ఆయన సతీమణి శాంతి ప్రియదర్శిలు ఆన్‌లైన్ ద్వారా రూ.1,10,116లను ఆలయ ఉపకమీషనర్, కార్యనిర్వ హణాధికారి సమక్షంలో నిత్యా న్నదాన పథకం అకౌంట్‌కు జమ చేయడం జరిగిందని ఉపకమీషనర్, కార్యనిర్వ హణాధికారి ఒక ప్రకటనలో పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో పెంచలకోనకు విచ్చేసిన తిక్కవరపు వినాయకరవిరెడ్డి ఆయన సతీమణి శాంతిప్రియదర్శి దంపతులకు ఆలయ మర్యాదలతో శ్రీవారి దర్శనం కల్పించిన అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ ఉప కమీషనర్, కార్యనిర్వ హణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి అందజేశారు.

## సత్తా చాటిన.. నారాయణ విద్యార్థులు



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** ఇటీవల నంద్యాలలో జరిగిన జాతీయ స్థాయి అండర్ 17 క్రికెట్ పోటీలలో నగరానికి చెందిన నారాయణ ఐఐటి క్యాంపస్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా శనివారం అరవింద నగర్ క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో జిఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, డీన్ సుధాకర్ రెడ్డి ఏజీఎం గురవయ్య ప్రిన్సిపల్స్ జయరామారావు, దేవి అధ్యాపకులు విద్యార్థుకు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ కళాశాలకు చెందిన 5మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నంద్యాలలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని రన్నర్స్‌గా నిలిచి సిల్వర్ పథకాన్ని సాధించారని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడా పోటీలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులు సెల్ ఫోనులను వీడి ఆటలు ఆడాలి




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు సెల్ ఫోన్లు విడనాడి ఆటలను ఆడాలని జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్ర, పొదలకూరు పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్ బాబు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్,మై భారత్ నెల్లూరు ఆధ్వర్యంలో ట్రీస్ సేవా సంస్థ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం మేరా యువ భారత్ బ్లాక్ స్థాయి క్రీడాపోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీలను స్థానిక ఎంపీడీఓ డి.నరసింహరావు ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు. వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, షాట్ పుట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్ర, పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ నారాయణ, ట్రీస్ సేవా సంస్థ ప్రెసిడెంట్ నౌరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేందుకు ఏదో ఒక క్రీడను అలవర్చుకోవాలన్నారు. కళాశాలలోను అన్ని రకాల క్రీడా వసతులను కల్పించామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పొదలకూరులోని వివిధ కళాశాలలు, పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా మల్లికార్జున్ యాదవ్, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, పెంచలనాయుడు, అలుపూరు శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు మైథిలి, శోభన్, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, పీఈటీ సురేష్, సుస్మిత పాల్గొన్నారు.